క్లుప్తంగా

భారత రాజ్యాంగం పుస్తక బహూకరణ



భారత రాజ్యాంగం పుస్తకాన్ని బహూకరిస్తున్న జ్ఞానసుందర్

అర్వపల్లి : హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆదివారం కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మాణిక్‌రావ్ ఠాక్రేను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, తుంగతుర్తి కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపర్తి జ్ఞానసుందర్ కలిశారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. అనంతరం ఆయనకు భారత రాజ్యాంగం పుస్తకాన్ని బహూకరించారు.

పదోన్నతులు కల్పించాలని వినతి



ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న భాషా పండిట్లు

నాగారం : రాష్ట్ర ప్రభుత్వం త్వరలో చేపట్టే ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్ల షెడ్యూల్‌లో భాషా పండిట్లకు స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతులు కల్పించాలని జిల్లా భాషోపాధ్యాయ ఐక్యవేదిక(జేఏసీ) ఆధ్వర్యంలో తిరుమలగిరిలోని ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎల్‌టీఏ జిల్లా అధ్యక్షురాలు శీల అవిలేను, రాష్ట్ర బాధ్యుడు కె.వీరన్న, జిల్లా కమిటీ సభ్యులు సుధాకర్, రవి, వెంకన్న, సైదులు, ప్రభాకర్, రవీందర్, మధు, రాంమూర్తి, ప్రదీప్‌కుమార్, మధు, బాలయ్య, ఆంజనేయులు, లింగయ్య పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులు

అర్వపల్లి : శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి టెంట్ హౌజ్ యజమానుల మండల నూతన కమిటీని ఆదివారం అర్వపల్లిలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నల్లకుంట్ల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా పొట్టిపాక చిన్నసైదులు, కోశాధికారులుగా దాసరి శ్రీను, కొప్పోజు రవి, ప్రధాన కార్యదర్శిగా బోయపల్లి జలేందర్, గౌరవ సలహాదారులుగా రాచకొండ వీరభద్రం, బొడ్డు భిక్షం, తండు రాంబాబు, సభ్యులుగా మిర్యాల వెంకన్న, కర్కాని రమేష్, పేరెల్లి ఉపేందర్, బోయపల్లి వీరయ్య ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీని పలువురు అభినందించి సన్మానించారు.

బీవీఎఫ్ నియోజకవర్గ కన్వీనర్‌గా నవీన్‌కుమార్



తుంగతుర్తిలో నియామకపత్రాన్ని అందజేస్తున్న బీఎస్పీ నాయకులు

తుంగతుర్తి : బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో నియోజకవర్గ బహుజన వాలంటరీ ఫోర్స్ (బీవీఎఫ్) నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బీవీఎఫ్ నియోజకవర్గ కన్వీనర్‌గా గుండపల్లి నవీన్‌కుమార్, మహిళా కన్వీనర్‌గా అనూష ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా బీవీఎఫ్ రాష్ట్ర కో-కన్వీనర్ సబావత్ బాబునాయక్ నూతనంగా ఎన్నికైన వారికి నియామకపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు కటకం శోభాబాయ్, బొడ్డ కిరణ్, బుడిగ మల్లేష్‌యాదవ్, దశరథ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

నూతనకల్ : మండల కేంద్రానికి చెందిన మెట్టు వీరయ్య, పిట్టల లింగయ్య ఇటీవల మృతి చెందారు. దీంతో ఆదివారం వారి కుటుంబాలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పరామర్శించారు. మృతుల కుటుంబాలకు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నాగం సుధాకర్‌రెడ్డి రూ.15వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తీగల గిరిధర్‌రెడ్డి, మహేశ్వరం చంద్రకళవెంకటయ్య, బొడ్డుపల్లి అంజయ్య, ఇమ్మారెడ్డి మల్లారెడ్డి, బండపల్లి శ్రీనివాస్, జటంగి గణేష్, ఉప్పల గణేష్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

నూతన జీపీలకు పక్కా భవనాలు

- తుంగతుర్తి మండలంలో ఆరు జీపీల భవనాలకు నిధులు మంజూరు
- ఒక్కో భవనానికి రూ.20 లక్షలు
- ఆనందం వ్యక్తం చేస్తున్న ప్రజలు, గ్రామ పంచాయతీ సిబ్బంది

తుంగతుర్తి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తండాలను, ఆవాస గ్రామాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసింది. మండలంలో గతంలో 12 గ్రామ పంచాయతీలు ఉండగా మరో 12 గ్రామ పంచాయతీలు నూతనంగా ఏర్పాటయ్యాయి. అయితే కొత్తగా ఏర్పడిన గ్రామపంచాయతీలకు కార్యాలయాలు లేక అద్దె భవనాల్లో, ప్రభుత్వ భవనాల్లో ఏర్పాటు చేశారు. కానీ కొత్త జీపీలకు సొంత భవనాలు లేక సిబ్బంది ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో ఇటీవల ప్రభుత్వం మండల పరిధిలోని 6 నూతన గ్రామ పంచాయతీలకు పక్కా భవనాల ఏర్పాటు కోసం నిధులు మంజూరు చేసింది. మండలంలోని కర్విరాల, కేశవాపురం, రామన్నగూడెంతండా, కాశీతండా, ఏనెకుంట తండా, సూర్యతండాలకు పక్కా భవనాలు మంజూరయ్యాయి. ఈ భవనాలను ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో ఒక్కొక్కటి రూ.20లక్షలతో నిర్మించనున్నారు. అలాగే నూతనంగా ఏర్పడిన దేవునిగుట్టతండా జీపీకి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో భవన నిర్మాణం పూర్తయింది. కాగా మరో 5 గ్రామ పంచాయతీలైన గుడితండా, సింగారంతండా, మంచతండా, రావులపల్లి ఎక్స్‌రోడ్డుతండా, బాపన్‌బావితండాల గ్రామ పంచాయతీలకు పక్కా భవనాలు మంజూరు కావాల్సి ఉంది. నూతనంగా ఏర్పడ్డ గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం పక్కా భవనాలు మంజూరు చేయడంతో ఆయా గ్రామ పంచాయతీల పాలకులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



కొత్తగూడెం గ్రామపంచాయతీ కార్యాలయం

శిథిలావస్థలో జీపీ భవనాలు...

తుంగతుర్తి మండలంలోని పాత గ్రామపంచాయతీలైన తుంగతుర్తి, సంగెం, వెలుగుపల్లి, మానాపురం, బండరామారం గ్రామాల్లో ఉన్న జీపీ భవనాలు శిథిలావస్థకు చేరాయి. వీటిలో తుంగతుర్తికి ప్రభుత్వం పక్కా భవనాన్ని మంజూరు చేసింది. కానీ ఈ భవన నిర్మాణ పనులు నేటి వరకు చేపట్టలేదు. పాత గ్రామ పంచాయతీల్లో ఎప్పుడో నిర్మించిన భవనాలు శిథిలావస్థకు చేరాయని, పాత జీపీలకు కూడా ప్రభుత్వం నూతన భవనాలు మంజూరు చేయాలని ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ప్రజలు కోరుతున్నారు.

నిధుల మంజూరు హర్షణీయం



నూతనంగా ఏర్పడిన కర్విరాల గ్రామ పంచాయతీలో జీపీ భవనానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం హర్షణీయం. ప్రస్తుతం కర్విరాల జీపీ కార్యాలయం అద్దెభవనంలో కొనసాగుతోంది. ప్రభుత్వం పక్కా భవన నిర్మాణానికి రూ.20లక్షల నిధులు విడుదలచేయడం ఆనందంగా ఉంది.

\- వెలుగు వెంకన్న, సర్పంచ్, కర్విరాల

త్వరలో నిర్మాణాలు చేపడుతాం



మండలంలో నూతనంగా ఏర్పడిన ఆరు గ్రామపంచాయతీలకు పక్కా భవనాల నిర్మాణం కోసం నిధులు మంజూరయ్యాయి. గ్రామ పంచాయతీల తీర్మానం చేసి నివేదిక ప్రభుత్వానికి పంపిస్తాం. ప్రొసీడింగ్ రాగానే నిర్మాణాల పనులు చేపడుతాం.

\- భీంసింగ్, ఎంపీడీఓ, తుంగతుర్తి

పోరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డికి ఘన నివాళి

సూర్యాపేట : పోలీస్ అధికారిగా, తెలంగాణ ఉద్యమ సమయంలో రాజకీయవేత్తగా ఈ ప్రాంత ప్రజలకు పోరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి చేసిన సేవలు మరువలేనివని పలువురు వక్తలు కొనియాడారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని త్రివేణి ఫంక్షన్ హాల్‌లో మాజీ ఐజీ పోరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి అభిమాన ఆహ్వాన కమిటీ ఆధ్వర్యంలో సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. ఐజీగా పదవీ విరమణ చేసి తాను పుట్టిన ప్రాంతానికి సేవ చేయాలన్న ఉద్దేశంతో చంద్రశేఖర్‌రెడ్డి రాజకీయాల్లోకి వచ్చారన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో సూర్యాపేట నియోజకవర్గంలో ఉద్యమానికి ఊపిరిపోశారని కొనియాడారు. మిర్యాలగూడ, సూర్యాపేట శాసనసభ్యుడిగా పోటీ చేసి ఓడిపోయినప్పటికీ ప్రజల మనసుల్లో స్థానం సంపాదించారని అన్నారు. కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త, సుధాకర్ పీవీసీ అధినేత మీలా మహదేవ్, మాజీ ఎమ్మెల్యే వేదాసు వెంకయ్య, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే సంకినేని వెంకటేశ్వర్‌రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ, మంత్రి జగదీశ్‌రెడ్డి తండ్రి గుంటకండ్ల రామచంద్రారెడ్డి, సుధాబ్యాంక్ ఎండీ పెద్దిరెడ్డి గణేష్, ఆహ్వాన కమిటీ కన్వీనర్, న్యాయవాది నూకల సుదర్శన్‌రెడ్డి, కోకన్వీనర్ పర్వతం శ్రీధర్, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కొల్లు మధుసూదన్‌రావు, డాక్టర్ ఆదుర్తి రమేష్‌చంద్ర, అడ్వకేట్ శశిధర్, తోట శ్యామ్ ప్రసాద్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



పోరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పట్టణ ప్రముఖులు

బాల్య వివాహాలు జరగకుండా చూడాలి



వినతిపత్రం అందజేస్తున్న కిశోర బాలికలు

ఆత్మకూర్ (ఎస్) : బాల్య వివాహాలు జరగకుండా గ్రామ పంచాయతీలో తీర్మానం చేయాలని కోరుతూ మండల పరిధిలోని నెమ్మికల్లు గ్రామ పంచాయతీ కార్యదర్శి హరికృష్ణకు ఆదివారం కిశోర బాలికలు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో కిశోర బాలికలు శిరీష, భావన, స్వప్న, మనీషా, అర్చన, లక్ష్మీప్రియ, రేవతి, కళ్యాణి, అఖిల, ప్రీతి, స్వప్న, ఎంవీఎఫ్ మండల ఇన్‌చార్జ్ వత్సవాయి లలిత తదితరులు పాల్గొన్నారు.

ఐక్యంగా సమస్యలు పరిష్కరించుకోవాలి



ప్రమాణస్వీకారం చేస్తున్న గండూరి కృపాకర్, నూతన కార్యవర్గ సభ్యులు

సూర్యాపేట : వ్యాపారులంతా కలిసికట్టుగా ఉండి వ్యాపారపరంగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించుకోవాలని, పట్టణ క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా మూడోసారి గండూరి కృపాకర్ ఎన్నిక కావడం అభినందనీయమని ఆర్టీఏ రాజేంద్రకుమార్, జిల్లా క్లాత్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు గండూరి శంకర్ అన్నారు. ఆదివారం పట్టణ క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ భవనంలో ఏర్పాటు చేసిన నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో వారు పాల్గొని మాట్లాడారు. అనంతరం నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన గండూరి కృపాకర్ మాట్లాడారు. నాలుగేళ్లుగా అధ్యక్షుడిగా ఉంటూ సంఘ సభ్యులతో కలిసి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. పట్టణ అధ్యక్షుడిగా గండూరి కృపాకర్, ఉపాధ్యక్షులుగా గుంటి మధుసూదన్, శింగిరికొండ ప్రదీప్ కుమార్, సయ్యద్ షఫీ, ప్రధాన కార్యదర్శిగా ఎలగందుల సుదర్శన్, సహాయ కార్యదర్శిగా దూలం నగేష్, సంయుక్త కార్యదర్శులుగా బొమ్మగాని సైదులు, తేలుకుంట్ల వెంకటేశ్వర్లు, కోశాధికారిగా అనంతుల రాజేశ్వర్, పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్‌గా పాపని యాదగిరి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు సవరాల సత్యనారాయణ, నూకల మధుసూదన్ రెడ్డి, బండారు రాజా, ముప్పారపు నాగేశ్వర్ రావు, నూకల వెంకటరెడ్డి, పిసిక వీరయ్య, సంఘ ప్రధాన సలహాదారులు కర్నాటి సురేందర్, మొరిశెట్టి కోటేశ్వర్ రావు, ఈగ వెంకటేశ్వర్లు, సింగరికొండ రవీందర్, పట్టణ క్లాత్ మర్చంట్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఐఎఫ్‌టీయూ జిల్లా సదస్సు పోస్టర్ ఆవిష్కరణ



నాగారం : పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు



చివ్వెంలలో..



మద్దిరాలలో..

నాగారం : కార్మిక చట్టాలు, సంక్షేమ పథకాల అమలుకై తిరుమలగిరి పట్టణంలో ఫిబ్రవరి 1న జరిగే ఐఎఫ్‌టీయూ జిల్లా కార్మిక సదస్సును జయప్రదం చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్‌కుమార్, జిల్లా నాయకుడు ముజ్జిగ వెంకటేశ్వర్లు కోరారు. ఆదివారం మండల కేంద్రంలో ఐఎఫ్‌టీయూ జిల్లా కార్మిక సదస్సు పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయని అన్నారు. ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడాలని పిలుపునిచ్చారు. అసంఘటిత కార్మికుల రక్షణ కోసం చట్టం చేసి, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమానపనికి సమాన వేతనం చెల్లించాలని, కార్మికులకు డబుల్‌బెడ్ రూం ఇళ్లు, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్మికుల హక్కులను కాపాడుకునేందుకు ప్రతి కార్మికుడు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీవైఎల్ జిల్లా నాయకుడు వేర్పుల కర్ణాకర్, ఐఎఫ్‌టీయూ నాయకులు గంట లింగమల్లు, బొడ్డుపల్లి అనిల్, ఆకుల సుభాష్, షేక్.షరీఫ్, గణేష్, గండమల్ల భిక్షం, బొమ్మగాని జానీ, పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

చివ్వెంల : తిరుమలగిరి పట్టణంలో ఫిబ్రవరి 1న జరుగనున్న ఐఎఫ్‌టీయూ జిల్లా సదస్సును విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా నాయకుడు కొండేటి యేసు, గోగుల వీరబాబు పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు అమ్మయ్య, నవీన్, గణేష్, వెంకన్న, నాగరాజు, మహేష్, రమేష్, ప్రశాంత్, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

సదస్సును జయప్రదం చేయాలి

మద్దిరాల : కార్మిక చట్టాల సంక్షేమ పథకాల అమలుకై తిరుమలగిరి పట్టణంలో తలపెట్టిన జిల్లా కార్మిక సదస్సును జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా నాయకుడు ఈర్లాల వెంకన్న పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేద్రంలో సదస్సుకు చెందిన పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కార్మిక హక్కులను కాలరాసే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పని చేస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు బూర్గుల పాపయ్య, బొంకూరి కృష్ణ, రవి, శంభయ్య పాల్గొన్నారు.

26నుంచి మహబూబా దర్గా ఉర్సు

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని దూపహాడ్ గ్రామంలో జాన్‌పహాడ్ ఉర్సుకు ప్రతీకగా మహబూబా ఉర్సు ప్రతి సంవత్సరం జరుగుతుంది. ప్రతి సంవత్సరం జాన్‌పహాడ్ ఉర్సు ప్రారంభమైన రోజు నుంచి మూడు రోజుల పాటు దూపహాడ్‌లో ఉర్సు నిర్వహించబడుతుంది. ఈ నెల 26, 27, 28 తేదీల్లో ఉత్సవాలు జరుగుతాయని నిర్వాహకులు గోపగాని చిన వెంకటేశం తెలిపారు.

ఉత్సవాల చరిత్ర..

దూపహాడ్ గ్రామానికి చెందిన గోపగాని చిన వెంకటేశం, లక్ష్మమ్మ దంపతుల కూతురు మహబూబా అనారోగ్యంతో పదకొండవ సంవత్సరంలో మృతి చెందింది. మహబూబా తన తల్లిదండ్రులకు కలలో వచ్చి దైవంగా మారానని దర్గా నిర్మించాలని కోరడంతో దర్గా ఏర్పాటు చేశారు. ఈ దర్గాకు దినదినం భక్తుల సందడి ఎక్కువవుతోంది. 20 సంవత్సరాలుగా భక్తుల కోర్కెలు తీర్చే దైవంగా పేరొందింది. సంతానం లేనివారు, అనారోగ్య బాధితులు, కోర్కెలు తీరిన భక్తులు అధిక సంఖ్యలో ఉత్సవాల్లో పాల్గొంటారు. ఈ ఉర్సుకు జాన్‌పహాడ్ దర్గా నుంచి గంధం ఊరేగింపుగా తీసుకువస్తారు. అదే రోజు రాత్రి ఉత్సవాలు ప్రారంభమవుతాయి. మునగాల, గరిడేపల్లి, నేరేడుచర్ల, పెన్‌పహాడ్, హుజూర్‌నగర్, సూర్యాపేట, మిర్యాలగూడ, మండలాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు.



దూపహాడ్‌లో ముస్తాబైన మహబూబా దర్గా

స్నేహితుడి కుటుంబానికి చేయూత

ఆత్మకూర్ (ఎస్) : మండల పరిధిలోని మిద్దనపల్లి గ్రామానికి చెందిన గుడిసె సతీష్ నెల రోజుల క్రితం రోడ్డు ప్రమాదానికి గురై మృతిచెందాడు. దీంతో అతడి స్నేహితులు ఆదివారం బాధిత కుటుంబానికి రూ.35 వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పరికపల్లి నగేష్, గడ్డమీది శ్రీనాథ్, సైదులు, సతీష్, నర్సయ్య, వీరయ్య, లింగయ్య పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందిస్తున్న స్నేహితులు

బీఆర్‌ఎస్‌తోనే దేశంలో అభివృద్ధి సాధ్యం



సూర్యాపేట రూరల్ : కౌన్సిలర్ బచ్చలకూరి శ్రీనివాస్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి



తుంగతుర్తి : మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న కార్యకర్తలు



అర్వపల్లి : మంత్రి, ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న జెడ్పీటీసీ వీరప్రసాద్, చైర్మన్



సూర్యాపేట టౌన్ : జన విజ్ఞాన వేదిక సైన్స్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట రూరల్ : సీఎం కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్‌ఎస్‌తోనే దేశాభివృద్ధి సాధ్యం అని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. సూర్యాపేటలోని పిల్లలమర్రి 12వ వార్డు కౌన్సిలర్ బచ్చలకూరి శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బీఆర్‌ఎస్‌లో చేరిన సందర్భంగా పిల్లలమర్రిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని బీఆర్‌ఎస్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశంలో ఎక్కడా కూడా తెలంగాణ తరహా అభివృద్ధి జరగలేదన్నారు. మోదీ సొంత రాష్ట్రం గుజరాత్‌లో సైతం సాగు కోసం ఇచ్చేది 6గంటల విద్యుత్ మాత్రమే అన్నారు. అక్కడి ప్రజలు దాహం కేకలతో అల్లాడిపోతున్నారని తెలిపారు. కేసీఆర్‌ను మించిన నాయకుడు దేశంలో ఎవరూ లేరన్నారు. బీఆర్‌ఎస్‌లో చేరిన పిల్లలమర్రి కౌన్సిలర్ శ్రీనివాస్‌తో పాటు 200మంది కాంగ్రెస్, బీజేపీ, ఇతర పార్టీల కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, జెడ్పీ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణగౌడ్, గ్రంథాలయ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, రాపర్తి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక

తుంగతుర్తి : రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ప్రజలు ఆకర్షితులై బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అన్నారు. ఆదివారం తిమ్మాపురంలో వెంపటి, గానుగుబండ గ్రామాలకు చెందిన చిర్ర నరేష్, పంజాల యాదగిరిలతో పాటు మరో 100 మంది కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరిన సందర్భంగా వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు తాటికొండ సీతయ్య, గుండగాని రాములు, తునికి సాయిలు, కొండగడ్పుల నాగయ్య, వెంకన్న, యాకయ్య, యాదగిరి, శ్రీనివాస్, నవీన్, మురళీ, పరశుములు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి, ఎమ్మెల్యేకు ఆహ్వానం

అర్వపల్లి : ఫిబ్రవరి 1నుంచి జరిగే అర్వపల్లిలోని శ్రీ యోగానందలక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని కోరుతూ సూర్యాపేటలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్‌లకు జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్ యాదవ్, దేవస్థాన చైర్మన్ చిల్లంచర్ల విద్యాసాగర్ ఆదివారం ఆహ్వాన పత్రికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కనుకు శ్రీనివాస్, పులిచర్ల ప్రభాకర్, ప్రభు, బత్తుల వెంకటేశ్వర్లు, అర్చకులు రాంబాబుఅయ్యంగార్, ఆనంద్‌దీక్షితులు పాల్గొన్నారు.

సామాన్య ప్రజల్లో కూడా శాస్త్రీయ దృక్పథం పెంపొందించాలి

సూర్యాపేటటౌన్ : సామాన్య ప్రజల్లో కూడా శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేలా జన విజ్ఞాన వేదిక కృషి చేయాలని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో జిల్లా జన విజ్ఞాన వేదిక సైన్స్ క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. విజ్ఞానాన్ని ప్రజలందరికీ చేరువ చేసేందుకు జన విజ్ఞాన వేదిక చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. విద్యార్థుల్లో సైన్స్‌దృక్పథాన్ని పెంపొందిస్తూ రేపటి తరానికి మంచి భవిష్యత్తును అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జేవీవీ జిల్లా అధ్యక్షుడు గొర్లమూడి రమేష్‌బాబు, షేక్ జాఫర్, శ్రీరామ్ ఆంజనేయులు, శ్రీనివాసారాజు, దుర్గాప్రసాద్, నారాయణ రెడ్డి, దయానంద్, గుండా రమేష్, వెంకటేశ్వర్లు, సైదులు పాల్గొన్నారు.

యువతకు 'ఓపెన్' ఫిట్‌నెస్

- పలు గ్రామాల్లో పూర్తికావొస్తున్న ఓపెన్ జిమ్‌ల నిర్మాణాలు
- అందుబాటులోకి వస్తే యువతకు ఎంతో ప్రయోజనం

పెన్‌పహాడ్ : పట్టణాలకే పరిమితమైన జిమ్ సెంటర్లు గ్రామాలకు చేరుకున్నాయి. శారీరక దారుఢ్యాన్ని పెంచేందుకు జిమ్ ఎంతగానో తోడ్పాటును అందిస్తుంది. గ్రామాల్లోని యువత దేహదారుఢ్యాన్ని పెంచుకునేందుకు ప్రభుత్వం ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా మండల పరిధిలోని అనంతారం, దూపహాడ్, మాచారం, గాజులమల్కాపురం, దోసపహాడ్, పెన్‌పహాడ్, భక్తాళాపురం, అనాజిపురం గ్రామాల్లో నూతనంగా జిమ్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నారు. డీఎంఎఫ్‌టీ నిధులతో ఒక్కో జిమ్ సెంటర్‌ను రూ.10లక్షల వ్యయంతో నిర్మిస్తున్నారు. ఓపెన్ జిమ్‌ల నిర్మాణ పనులు తుదిదశకు చేరుకున్నాయి. ప్రజలకు అనుకూలంగా, ఆహ్లాదకరమైన వాతావరణంలో వీటిని నిర్మిస్తున్నారు. అనాజిపురం, భక్తాళాపురం గ్రామాల్లో ఓపెన్ జిమ్ సెంటర్ల నిర్మాణ పనులు ఇంకా మొదలు పెట్టలేదు.

రోగాలకు చెక్..

ఓపెన్ జిమ్‌లోని వివిధ రకాల పరికరాలతో యువత, ప్రజలు ఫిట్‌నెస్ పెంచుకోవచ్చు. తద్వారా రోగాలు దరిచేరవు. ప్రస్తుతం చిన్నపిల్లల నుంచి పెద్దల వరకు అనేకమంది స్థూలకాయంతో అనారోగ్యాలకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో వ్యాయామశాల ఉపయోగం ప్రతి మనిషికి తప్పనిసరి అవుతోంది. ఎంతో ఖర్చుతో కూడిన జిమ్ పరికరాలు గ్రామాల్లో కూడా అందుబాటులోకి వస్తుండటంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



అనంతారంలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ఓపెన్ జిమ్ సెంటర్

ఎన్నో ప్రయోజనాలు



ఓపెన్ జిమ్ సెంటర్ల ఏర్పాటుతో ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయి. చిన్నప్పటి నుంచి జిమ్ చేయడం వల్ల దేహదారుఢ్యంతో పాటు ఆరోగ్యవంతమైన సమాజం రూపొందుతుంది. ఆర్మీ, పోలీస్, నేవీ వంటి ఉద్యోగాల్లో చేరడానికి జిమ్ ఎంతగానో దోహదపడుతుంది.

\- దామెర్ల రమేష్, అనంతారం

క్రీడాకారులకు ఉపయోగం



గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులు ఓపెన్ జిమ్ సెంటర్లు ఎంతగానో ఉపయోగపడతాయి. యువత ఫిట్‌నెస్ పెంచుకుంటే క్రీడల్లో మంచి ప్రతిభ కనబరచవచ్చు. గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న ఓపెన్ జిమ్ సెంటర్లను యువత సద్వినియోగం చేసుకోవాలి.

\- మామిడి అనితఅంజయ్య, జెడ్పీటీసీ, పెన్‌పహాడ్

ఆరోగ్యవంతమైన సమాజం



ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని యువత ఆరోగ్యం పొందేలా ఓపెన్ జిమ్‌ల స్థాపనకు నడుం బిగించింది. ప్రతిఒక్కరూ ఫిట్‌నెస్‌ను పెంపొందించుకుంటే ఆరోగ్యవంతమైన సమాజం తయారవుతుంది. జిమ్ నిర్మాణ పనులు తుదిదశకు చేరుకున్నాయి.

\- నెమ్మాది భిక్షం, ఎంపీపీ, పెన్‌పహాడ్

రుణమాఫీ అమలుచేయాలి

నూతనకల్ : సీఎం కేసీఆర్ రైతులకు ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీని వెంటనే అమలు చేయాలని సీపీఐ మండల కార్యదిర్శ తొట్ల ప్రభాకర్‌గౌడ్ కోరారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఏకకాలంలో లక్ష రుణమాఫీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు యానాల వెంకట్‌రెడ్డి, మద్దెల రామ్మూర్తి, రవి, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఉద్యమించేది సీపీఎం

చివ్వెంల : ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు నిర్వహించేది సీపీఎం మాత్రమే అని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్థిక అసమానతలు ఉన్నంత కాలం కమ్యూనిజం ఉంటుందన్నారు. ప్రపంచంలో కమ్యూనిస్టు సిద్ధాంతానికి ప్రత్యామ్నాయం లేదన్నారు. పేదలు, రైతాంగం, వృత్తిదారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం సీపీఎం ఉద్యమాలు చేస్తోందన్నారు. ప్రజలు ఇతర పార్టీలను నమ్మే పరిస్థితిలో లేరని తెలిపారు. బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 26న వందలాది ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు నెమ్మాది వెంకటేశ్వర్లు, మట్టపల్లి సైదులు, కొండేటి ఉపేందర్, బచ్చలకూరి రాంచరణ్, పారెపల్లి వెంకయ్య, కలగాని సోమయ్య, భూషయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మల్లు నాగార్జున్‌రెడ్డి